# కోరిక

చిన్నకోట సుశీలాదేవి




సాయంత్రం ఏడుగంటల వేళ!

సీతమ్మగారు నూతి గట్టుమీద కూర్చుని ముఖం కడుక్కుంటోంది. హఠాత్తుగా ఆవిడ దృష్టి ఎదుటి గోడమీద కూర్చున్న కాకి మీద పడింది.

కాకి రెండు కాళ్ళమధ్య ఒక గారెముక్కని ఇరికించుకుని కొద్ది కొద్దిగా కొరుక్కు తింటోంది. ఆ గారెని చూడగానే ఆవిడకి నోరూరింది.

ఎక్కడి నుండి తెచ్చుకుందో? ఎంతో తీరుబడిగా కూర్చుని తింటోంది. ప్చ్! 'నేను కూడా ఇవ్వాళ గారెలు తింటె బాగుణ్ను' అనుకుంది ఆవిడ.

అంతేకాదు—ఆ కాకిని కొట్టేసి ఆ గారిని తెచ్చేసుకుందామా! అనే ఆవేశం కూడా కలిగింది. దాన్ని అతికష్టం మీద అణచుకుంది.

ఆవిడ నూతిగట్టు మీదే కూర్చుని గారెముక్కని తింటున్న కాకివేపు ఆశగా, ఆబగా చూడసాగింది.

సీతమ్మగారికి డెబ్భై ఏళ్ళొచ్చాయి. ఒంట్లో ఓపికలేకపోయినా, ఎవరి సహాయం లేకుండా తన పని మాత్రం ఎలాగో చేసుకోగలదు.

చిన్నప్పట్నించీ ఆవిడకి గారెలన్నా, ఇతర చిరుతిళ్ళన్నా చాలా ఇష్టం. తండ్రిది పెద్ద సంసారం! ఆయన స్కూలు టీచరు. ఇంట్లో అందరికి కడుపు నిండా తిండే పెట్టలేకుండా వుంటే, ఇంకా ఫలహారాలు ఎక్కడినుంచి వస్తాయి?

అందుకే పిల్లలు ఏదైనా చెయ్యమని అడిగితే ఇంట్లోని బాధలు చెప్పలేక తల్లి కన్నీరు కార్చేది.

కొంచెం పెద్దయ్యాక తమ ఇంటి పరిస్థితి తెలుసుకుని తన కోరికలను తనలోనే అణచుకుంది సీతమ్మ

తనకు తొందరగా పెళ్ళయితే, అప్పుడు తను ఏదికోరితే అది చేసుకు తినొచ్చని వూహాగానాలు చేసేది. తన భర్త తన కోరికలన్నీ తీరుస్తాడని మురిసిపోతుండేది.

తీరా పెళ్ళయి అత్తవారింటికి వచ్చాక గాని, తనెలాంటి వూబిలోకి దిగబడిపోయిందో తెలీలేదు. అత్తవారిది వుమ్మడి కుటుంబం, భర్త శివరావు తాలూకాలో చిన్న గుమస్తా. ఆడబడుచులూ, తోడికోడళ్ళు, వాళ్ళ పిల్లలతో ఇల్లు ఎప్పుడూ రైల్వే ప్లాట్‌ఫామ్‌లా కిటకిటలాడుతూ వుండేది!

పొద్దున్న లేచిన దగ్గర్నించీ రాత్రి పడుకోబోయేంతవరకూ వూపిరి సలపని పని. ఇక అక్కడ కోరికలకీ, ఆశలకీ తావేలేదు. ఆ సందట్లోనే పిల్లలు కలిగారు. పుట్టడమైతే

ఆరడజను మంది పుట్టినా ఒక్క కొడుకూ, కూతురు మాత్రమే దక్కారు.

కొడుక్కి పదేళ్ళ వయసప్పుడు శివరావు గుండె పోటుతో మరణించాడు. సీతమ్మ కొడుకూ, కూతుర్నీ తీసుకుని పుట్టింటి కొచ్చింది. అప్పటికావిడ తండ్రి కూడా చనిపోయాడు.

శివరావుకి పెన్షన్ వచ్చేది! ఆ డబ్బుతో వేరే ఇల్లు తీసుకుని గుట్టుగా రోజులు వెళ్ళదీయ సాగింది. అప్పడాలు వత్తడం, విస్తళ్ళు కుట్టడం, మొదలైన పనులు చేసి, తన కడుపుకి కూడా తినకుండా పిల్లలకోసం పైసా, పైసా కూడబెట్టసాగింది.

పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. కూతురికి గంతకుతగ్గ బొంతని చూసి ముడి పెట్టింది. కొడుకు రామ్మూర్తి బికామ్ పాసయి, ఒక ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా చేరాడు.

సీతమ్మ సీతమ్మగారై కొడుకు పంచన చేరింది. వయస్సు మీరుతోన్నకొద్దీ ఆవిడకి తిండి మీద కోరిక తగ్గాలిసింది పోయి, రోజు రోజుకీ ఎక్కువ కాసాగింది. పూర్వం ఏదైనా తినాలనే కోర్కె వున్నా, అది తీరే అవకాశం లేదని తెలిసి, దాన్ని మనసులోనే అణచుకునేది. కాని ఇప్పుడలా అణచుకొనే శక్తి పోయింది. ఏవేవో తినాలని ఆవిడ మనస్సెప్పుడూ కొట్టుకు పోతూ వుంటుంది.

ఇప్పుడు ఇంట్లో ఇదివరకులా అటువంటి ఇబ్బందులూ లేవు. రామ్మూర్తి బాగానే సంపాదిస్తున్నాడు. అతడికి ఇద్దరు మొగపిల్లలు. ఇద్దరూ కూడా ఇంకా చిన్నవాళ్ళే! కానీ వచ్చిన చిక్కల్లా కోడలు కాంతంతోనే.

సామాన్యంగా అందరి కోడళ్ళలానే కాంతానికి అత్తగారంటే పడదు. అత్తగారి మాటంటేనే చిరాకు. తనూ అందరిలా హాయిగా, స్వేచ్ఛగా వుండకుండా తన అత్తగారింకా బ్రతికుండి, తన మెడకు గుదిబండలా తయారయిందని కాంతానికి కోపం! అందుకే పిల్లి మీదా, ఎలుక మీదా పెట్టి రోజూ ఆవిడని సాధిస్తూ వుంటుంది.

సీతమ్మగారు కోడలి సాధింపులు వింటూ తననింకా బతికుండనిచ్చినందుకు దేవుడిని మనసులో తిట్టుకుంటూ, దుఃఖిస్తూ వుంటుంది.

రామ్మూర్తికి రోజంతా కంపెనీ పనితోనే సరిపోతుంది. రోజూ వచ్చి తల్లి దగ్గిర కాస్సేపు కూర్చుని, ఆవిడ బాగోగులు కనుక్కునే తీరిక అతడికి లేదు!

ఎప్పుడో బుద్ధిపుట్టినప్పుడు వచ్చి—

"అమ్మా! కులాసాగా వున్నావా?" అని అడుగుతాడు.

రాకరాక తన దగ్గరకొచ్చిన కొడుకుతో, కోడలి మీద నేరాలు చెప్పి అతన్ని బాధ పెట్టడం ఇష్టంలేక—

"బాగానే వున్నాను!" అనేది ఆవిడ నవ్వుతూ!

కానీ రోజురోజుకీ సీతమ్మగారి జీవితం దుర్భరంగా తయారవసాగింది. ఎప్పుడో తీరికున్నప్పుడు కోడలు ఇంత అన్నం విస్తట్లో పడేసి పిలుస్తుంది. సీతమ్మగారు లేచి ఆ అన్నం తిని మళ్ళీ పడుకుంటుంది.

వెనకవేపు వసారాలో, ఒక మూలగా చాప మీద రోజల్లా అలా పడుకునే వుంటుంది. ప్రేమగా మాట్లాడేవారు లేరు. కనీసం 'ఎలా వున్నావని' అడిగే వారు లేరు. దీనికి తోడు కోడలి విసుగులు, చిరాకులు వీటితో సీతమ్మగారు మానసికంగా కృంగిపోసాగింది.

* * *

"బామ్మా! నేను స్నానం చెయ్యాలి! నువ్వు లే! నీళ్ళు పడతాయి" అంటూ మనవడు రాజా వచ్చి బాల్చీ మాతితో వేశాడు.

సీతమ్మగారు కళ్ళు విప్పి చూసింది. ఎండ చిరచిరలాడుతోంది. కాకికోసం చూసింది. కానీ అది కన్పడలేదు. ఎగిరిపోయి వుంటుంది. చిన్నగా నిట్టూరుస్తూ అక్కడి నుంచి లేచి కర్రసాయంతో లోపలికొచ్చింది. వసారాలో దుప్పటి ముసుగేసుకుని పడుకుంది.

కానీ మనసంతా గారెలమీదే వుంది. ఇవ్వాళ ఎలాగైనా గారెలు తినాలి తన కోర్కె తీర్చుకోవాలి. కానీ ఎలా? కాంతం చెయ్యదు. ఇక రామ్మూర్తి చేతో, రాజా చేతో బయటి నుండి తెప్పించుకోవాలి" అనుకుంది.

పదకొండు ప్రాంతంలో కాంతం "వడ్డించాను!" అని పిలవగానే లేచి వెళ్ళి విస్తరిముందు కూర్చుంది. కానీ అన్నం సహించలేదు. కళ్ళముందు కాకి తింటున్నగారె ముక్కే కదలాడింది. ఎలాగో భోజనం అయిందనిపించి అక్కడి నుండి లేచి మళ్ళా చాపమీద ఒరిగింది.

మధ్యాహ్నం ఒంటిగంటకి ముందుగది లోంచి రామ్మూర్తి, మాట వినిపించేసరికి చటుక్కున లేచి కూర్చుంది.

రోజూ పొద్దున్న వెళ్ళి సాయంత్రం వచ్చేవాడు ఇవ్వాళ మధ్యాహ్నం ఇంటికొచ్చా డెందుకో? "పోనీ ఇదీ మన మంచికే" అనుకుంటూ ఆవిడ లేచి ముందు వాకిట్లోకి వచ్చి కూర్చుంది.

రామ్మూర్తి తిరిగి ఆఫీసుకెళ్ళబోతుంటే—

"నాయనా! రామ్మూర్తీ!" అని పిల్చింది.

రామ్మూర్తి ఆగాడు.

తల్లివేపుచూసి "ఏమిటమ్మా!" అన్నాడు.

"ఒక్క అర్ధరూపాయ ఇవ్వవూ!" అనడిగింది ఆవిడ.

రామ్మూర్తి జేబు చూసుకున్నాడు పావలా మాత్రం వుంది. నెల రాగానే జీతం అంతా తెచ్చి కాంతం చేతికిస్తాడు. ఆవిడే అతనికి నెలఖర్చులకింత అని ఇస్తూ వుంటుంది. అది సరిపోయినా, లేకపోయినా ఎలాగో సర్దుకుంటాడు. అంతేకానీ, భార్యని మళ్ళీ అడగడు. అడగలేడు.

జేబులోవున్న పావలాకాసు తీసి తల్లి చేతికిస్తూ "ఎందుకమ్మా?" అనడిగాడు.

"గారెలు తినాలని వుంది నాయనా! తెప్పించుకుంటాను!" అంది ఆవిడ.

"నేను తెచ్చిపెడతానమ్మా!" అని అంటాడేమోనని ఎదురుచూసింది.

కానీ రామ్మూర్తి తల్లి కోరిక విని మనసులో నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

కొడుకు అలా వెళ్ళిపోయినందుకు ఆవిడ కాస్సేపు బాధ పడింది. ఇక చేసేది లేక ఆ పావలా పుచ్చుకుని పెద్ద మనవడు రాజా స్కూలు నుండి ఎప్పుడు వస్తాడా! అని ఎదురు చూస్తూ, అక్కడే కూర్చుంది ఆవిడ.

నాలుగున్నరకి స్కూలు నుండి వచ్చాడు రాజా. పుస్తకాలు ఇంట్లో పారేసి ఆటలకు పరిగెత్తబోతుంటే సీతమ్మగారు వాడిని ఆపింది.

"రాజా! ఇలారా! తండ్రీ!" అంటూ పిలిచింది.

రాజా ఆవిడ దగ్గరకొచ్చి "ఏమిటి బామ్మా!" అన్నాడు.

"ఈ పావలా పుచ్చుకుని ఓటేల్లో రెండు గారెలు తెచ్చిపెట్టు నాయనా!" అనడిగింది.

రాజా ముఖం చిట్లించాడు.

"ఇప్పుడా! నేను ఆటలకి పోవాలి బామ్మా!" అన్నాడు చిరాగ్గా.

"అలా అనకురా! తినాలని వుంది తెచ్చి పెట్టవ్! నా తండ్రివిగా! నా బాబువిగా!" బతిమాలాడింది ఆవిడ

రాజా చివరికి "సరే ఇటివ్వు! ఆటలనుండి వచ్చేటప్పుడు తెస్తా!" అన్నాడు.

ఆవిడ సంతోషంతో కొంగున కట్టుకున్న పావలాకాసు వూడదీసి, మనవడి చేతిలో పెట్టింది వాడు దాన్ని పుచ్చుకుని పరుగు తీశాడు

ఆరు గంటల ప్రాంతంలో తిరిగొచ్చాడు రాజా అప్పటివరకూ సీతమ్మగారు మనవడి కోసం ఎదురుచూస్తూ ఆ అరుగుమీదే కూర్చుంది. రాజా వస్తూనే "ఇదిగో! బామ్మ!" అంటూ పొట్లాం ఆవిడ చేతిలో పెట్టాడు

"మా నాయనే తెచ్చావా!" అంటూ ఆవిడ ఆ ఆత్రంగా పొట్లాం విప్పి గారెలు తుంచబోయింది కానీ అవి విరగలేదు. చేతో ఒకటి తీసుకుని పళ్ళ మధ్య పెట్టి కొరకబోయింది కాని అది కొరుక్కుడు పడలేదు. అవి గారెలో! కంకటిరాళ్ళో ఆవిడకర్థం కాలేదు

కానీ చూస్తూ, చూస్తూ వాటిని పారెయ్యలేకపోయింది. అలాగే చప్పరించబోయింది కానీ అవి ఏదో మట్టివాసన కొడుతూ. తింటుంటే కడుపులో తిప్పడం మొదలెట్టింది ఇక వాటిని తినలేక అవతల పారేసింది నిరాశతో అక్కడి నుండి లేచి, వసారాలోకి వచ్చి చాప మీద పడుకుని దుప్పటి ముసుగు పెట్టుకుంది.

కడుపులో వికారంగానూ, మంటగానూ వుంది రెండుసార్లు వాంతి చేసుకుంది ఆ రాత్రి అన్నం తినలేదు.

తెల్లవారింది.

రోజూ చీకటితోనే లేచి దుప్పటికప్పుకొని, కూర్చుని, ఏవేవో పాటలు పాడుకుంటూ వుండే ఆవిడ, ఆ రోజు పొద్దెక్కినా లేవలేకపోయింది.

పదిగంటలవుతుండగా విలాగో ఓపిక చేసుకుని, లేచి తన పనులు చూసుకొచ్చి మళ్ళా పడుకుంది కడుపులో వికారం, మంట తగ్గలేదు. తనకిష్టమైన గారెలు తినలేకపోయాననే దిగులు. దానికి తోడు పొద్దుటి నుండి తను ఇలా పడుకుని వున్నా తనని పలకరించేవారు, 'ఎందుకిలా పడుకున్నావు?' అని అడిగేవారు లేరనే విచారం!

ఒకప్పుడు తనీ ఇంట్లో అందరికీ అవసరం అయ్యింది. "అమ్మా" అంటూ పిల్లలు; "సీతా" అంటూ ఆయన క్షణం స్థిమితంగా వుండనీయకుండా పిలిచేవారు

ఇప్పుడు ఆయన లేరు! పిల్లలు వున్నా వాళ్ళకి తను అక్కర్లేదు. తనతో వాళ్ళవసరం తీరిపోయింది వాళ్ళ ప్రపంచం వాళ్ళది. ఇక తను జీవించి వుండడ మెందుకు? ఇంకా ఏ సుఖాలు అనుభవించాలి?

ఇన్నాళ్ళ జీవితంలో తన కోరికా, ఆశా, ఒక్కటీ తీరలేదు. తన తండ్రి కానీ, భర్త కానీ, ఒక్క కోరికని తీర్చలేకపోయారు. చివరకు తన కొడుకు కూడా గారెలు తినాలనే చిన్న కోరికని తీర్చలేకపోయాడు. అయిపోయింది తన జీవితం! రేపో, మాపో చావడానికి సిద్ధంగా వుంది.

సీతమ్మగారు ఏడుస్తోంది, శరీరమంతా కదిలిపోయేట్టుగా ఏడుస్తోంది అలా ఏడుస్తూనే నిద్రపోయింది.

మధ్యాహ్నం కాంతం భోజనానికి పిలిచినా లేవలేదు కాంతమ్మ రెండుసార్లు పిలిచి 'ఆకలైతే ఆవిడే అడుగుతుందిలే' అనుకుని వూరుకుంది. నాలుగ్గంటల ప్రాంతంలో ప్రక్కింటి సరస్వతమ్మ వచ్చింది

"సీతమ్మగారూ! పురాణానికి వస్తారా?" అనడిగింది

సీతమ్మగారు దుప్పటి ముసుగులో నుండే 'ఊఁ' అంటూ మూలిగింది.

"అదేమిటండీ! అలా పడుకున్నారూ" అంటూ ఆవిడ దుప్పటి తొలగించి మీద చెయ్యేసింది సీతమ్మగారి ఒళ్ళు కాలిపోతోంది. "అరె! జ్వరం వచ్చినట్టుందే" అనుకుంది.

సీతమ్మగారు మూలుగుతోంది. సరస్వతమ్మ లోపలికెళ్ళి "కాంతమ్మా! మీ అత్తగారికి జ్వరం వచ్చిందమ్మా" అంటూ చెప్పింది

కాంతమ్మ ముక్కూ, మూతీ విరుస్తూ "జ్వరం వచ్చిందీ! నాకు తెలుసు వస్తుందని. నానా గడ్డీ తింటే జ్వరం రాదూ? ఈవిడ మా ప్రాణాలు తీయడానికే ఇంకా బతికుంది! ఎప్పుడు ఈ పీడ విరగడవుతుందో గనీ!" అంటూ మొదలు పెట్టింది

సరస్వతమ్మ ఆవిడ ధోరణికి బాధపడుతూ అక్కడి నుండి వెళ్ళిపోయింది

సాయంత్రం రామ్మూర్తి ఆఫీసు నుండి వచ్చాడు!


రాగానే రాజా—"నాన్నా! బామ్మకి జ్వరం వచ్చింది!" అంటూ వార్త అందించాడు.

రామ్మూర్తి గబగబా తల్లి దగ్గరకు వచ్చి—

"అమ్మా! జ్వరంగా వుందా!" అన్నాడు. కానీ ఆవిడ పలకలేదు. మూలుగుతోంది. దుప్పటి కప్పుకున్నా గజ గజా వణికిపోతోంది.

రామ్మూర్తి ఆవిడని ఎత్తి మంచం మీద పడుకోబెట్టాడు డాక్టరుని తీసుకొచ్చి ఇంజక్షనిప్పించాడు

తెల్లవారింది ఆవిడ జ్వరం ఇంకా ఎక్కువైంది జ్వరంతోపాటు సంధి ప్రేలాపన కూడా మొదలైంది.



"నాయనా! రామ్మూర్తీ! ఒక్క గారె ముక్క తెచ్చి పెట్టరా! తినాలని వుంది!"

"కాంతం! గారెలకి పప్పు నానబొయ్యవే! రాజా! మర్నాడు వినిపించుకోరా! నిన్న తెచ్చినవి బాగాలేదురా! ఇదుగో పావలా తీసుకుని మంచివి తెచ్చిపెట్టరా! తండ్రీ!" ఆ మాటలు వింటోంటే రామ్మూర్తి దుఃఖం ఆపుకోలేకపోయాడు.

"అమ్మా" అంటూ బావురుమన్నాడు. "అమ్మా! నే నెంత మూర్ఖుడిని! నువ్వు నోరు తెరిచి అడిగితే ఒక్క గారెముక్క కొని పెట్టలేకపోయాను! నీ కోరిక విని నవ్వుకున్నానేకాని, 'అమ్మా! నేను తెచ్చిపెడతాను' అని అనలేక పోయాను! నన్ను క్షమించమ్మా!"

రామ్మూర్తి మనసు మనసులో లేదు. ఏవేవో సంఘటనలు జ్ఞాపకం వస్తున్నాయి.

అమ్మ చిన్నప్పుడు తనని ఎంతో ప్రేమగా చూసేది. తండ్రి ఏదైనా తెచ్చినా, అమ్మ వంతు తనకి పెట్టేది.

ఒకసారి జామచెట్టెక్కి కాలు విరుచుకున్నాడు. చాలా రోజులవరకూ కాలుని కదలలేకపోయాడు అప్పుడు అమ్మ తనకెంత సేవో చేసింది. తన కాలు నయమయ్యేవరకూ తనని క్రిందకు దించలేదు.

కాలేజీలో చదివేటప్పుడు ఒకసారి ప్రైవేటు క్లాసు ఉండటంవల్ల మధ్యాహ్నం ఇంటికి భోజనానికి రాలేకపోయాడు. అప్పుడు

# కోరిక

అమ్మ కాలేజీలో అన్నం పెట్టుకుని ఎండలో నడిచి కాలేజీకి వచ్చింది ఆ తల్లి ప్రేమకి తన స్నేహితులు ఆశ్చర్యపోయారు అటువంటి తల్లి వున్నందుకు తనని అభినందించారు.

ఇంకా ఇటువంటి సంఘటన లెన్నో వున్నాయి. అవన్నీ గుర్తుకు తెచ్చుకుని రామ్మూర్తి దుఃఖపడుతున్నాడు.

కాంతం భర్త ఏడవుని చూసి ముఖం చిట్లించింది. "ఏవిటా ఏడుపు! చిన్న పిల్లాడిలా!" అంటూ విసుక్కుంది.

రామ్మూర్తి దాన్ని పట్టించుకోలేదు. తల్లినిగూర్చే బాధపడుతున్నాడు. తననంత ఆప్యాయంగా చూసిన తల్లిని ఈ వయసులో తనేం సుఖపెట్టాడు? తల్లిని భార్యకి అప్పజెప్పాడు ఆవిడ్ని ప్రేమతో పలకరించడానికి కూడా తనకి తీరికలేకపోయింది తన భార్య తల్లిని ఎలా చూస్తోందో తెలుసుకోలేకపోయాడు

"అమ్మా! నీకేవన్నా తినాలని వుందా! తెచ్చిపెట్టనా!" అని ఒక్కసారి కూడా అడగలేదు.

రామ్మూర్తి మనసులో పశ్చాత్తాపపడసాగాడు "ఎంత పొరపాటు చేశాడు! తల్లి నెంత నిర్లక్ష్యం చేశాడు. మళ్ళీ రోజులు వెనక్కి వెడితే ఎంత బాగుండును. అప్పుడు తను చేసిన పొరపాట్లని సరిదిద్దుకుంటాడు. కానీ అది సాధ్యం కాదు గదా" బాధపడుతూ తల్లి మంచం ప్రక్కనే కూర్చున్నాడు.

సీతమ్మగారు అలా అపస్మారక స్థితిలోనే వుంది తల్లి ఒక్కసారి కళ్ళు విప్పిచూస్తే— "అమ్మా! నన్ను క్షమించమ్మా! నీ ఋణం తీర్చుకోలేకపోయాను" అంటూ ఆవిడ గుండెలమీద తల పెట్టుకుని ఏడ్వాలనుకున్నాడు. తల్లి ప్రేమగా తన తల నిమురుతూంటే అన్నీ మర్చిపోదామనుకున్నాడు.

కానీ రామ్మూర్తి కోరిక తీరకుండానే ఆవిడ మళ్ళీ కళ్ళు తెరవకుండానే, శాశ్వతంగా కన్ను మూసింది.

రామ్మూర్తి ఏడ్వడానికి కూడా ఓపిక లేనటు సర్వం కోల్పోయినవ్యక్తిలా కూర్చుండిపోయాడు.

కానీ కాలం ఎవరికోసమూ ఆగదు యధావిధిగా కర్మకాండలు మొదలయ్యాయి. బంధువులతో, స్నేహితులతో ఇల్లు నిండిపోయింది.

మంత్రాల తంతు ముగిశాక భోజనాలు వడ్డించారు "ఆహా! ఎంత బాగున్నాయి ఈ గారెలు?"; "ఎవరు చేశారండీ" అంటూ మెచ్చుకుని— "ఇంకో రెండు గారెలు వెయ్యండి!" అని భోజనం చేస్తున్న వాళ్ళందరూ ఇంకా, ఇంకా గారెలు వేయించుకుని తింటున్నారు. అలా గారెల్ని తింటున్న వాళ్ళని చూడగానే రామ్మూర్తికి తన తల్లి, ఆవిడ కోరిక గుర్తుకువచ్చాయి.

"నాయనా! రామ్మూర్తీ! ఒక్క గారెముక్క కోసం నే నెంత తపించిపోయానురా. నాకు ఒక్క గారెముక్క పెట్టలేకపోయావు. కానీ నేను చచ్చాక వీళ్ళందరికీ విస్తరి నిండా గారెలు వడ్డిస్తున్నావ్! అంతే నాయనా! మనుషులింతేరా తండ్రీ!" అని అడుగుతున్నట్టనిపించి ముఖానికి తువ్వాలు అడ్డుపెట్టుకుని బావురుమన్నాడు.

రామ్మూర్తి ప్రక్కన నిలబడ్డ వ్యక్తి— "వూర్కోండి! రామ్మూర్తిగారూ! పండుటాకు ఎంతకాలం వుంటుంది! ఆవిడ కోరికలన్నీ తీర్చుకుని హాయిగా వెళ్ళిపోయింది. ఇంకెందుకు విచారం" అన్నాడు.

అది విని రామ్మూర్తి—'ఆవిడ కోరికలన్నీ తీరాయా! ఆవిడ హాయిగా ఏ చీకూ చింతా లేకుండా ప్రశాంతంగా చనిపోయిందా?' మనసులో బాధగా అనుకున్నాడు రామ్మూర్తి.

